సాక్షి
నిర్మల్
బుధవారం : 29 : మే : 2024



అరచేతిలో వాతావరణం
రైతులు, ప్రజలకు వాతావరణ మార్పులు తెలిసేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లు రూపొందించింది.
8లో ▸



నిర్లక్ష్యానికి నిదర్శనం
భైంసా పట్టణంలో పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సొంత భవనాలు మంజూరవగా పనులు ప్రారంభించి నిలిపివేశారు.
9లో ▸

గరిష్టం/కనిష్టం
42.6 /31.5

వాతావరణం
చాలావరకు ఎండగా ఉంటుంది. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉదయం నుంచే వేడి అధికంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నెలాఖరు వరకే జొన్నల కొనుగోళ్లు

నిర్మల్‌చైన్‌గేట్: మార్క్‌ఫెడ్ ప్రధాన కార్యాలయం ఆదేశాల మేరకు జొన్నల కొనుగోళ్లు ఈనెల 31 వరకు మాత్రమే చేపట్టనున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో మార్క్‌ఫెడ్ అధ్వర్యంలో తొమ్మిది ప్రాథమిక సహకార సంఘాల ద్వారా షెడ్యూల్ ప్రకారం ప్రభుత్వ మద్దతు ధర రూ.3180తో ఇప్పటి వరకు 74,73,000 మెట్రిక్ టన్నులను జొన్నలు 3,359 మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు వివరించారు. కొనుగోళ్ల గ్రామాల వారీ షెడ్యూల్ ప్రకారం దాదాపు అన్నీ గ్రామాల్లో పూర్తయినట్లు తెలిపారు. ఇంకా అమ్మకుండా ఉన్న రైతులు తమకు సంబంధించిన మార్కెట్ యార్డ్‌లో ఈనెల 31లోపు విక్రయించాలని సూచించారు.

వారణాసిలో జిల్లా నేతల ప్రచారం..



వారణాసిలో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పవార్ రామారావుపటేల్

భైంసాటౌన్: ప్రధాని నరేంద్రమోదీ పోటీచేస్తున్న వారణాసిలో జిల్లాకు చెందిన బీజేపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌తో కలిసి మోదీకి మద్దతుగా ప్రచారం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని అక్కడి తెలుగువారిని కలిసి ఓట్లు అభ్యర్థించారు. మూడురోజులపాటు అక్కడే ఉండి ప్రచారంలో పాల్గొనున్నట్లు నేతలు తెలిపారు.

తెలుగువారి గుండెల్లో ఎన్టీఆర్



ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్, నాయకులు

నిర్మల్‌టౌన్: నటుడిగా, రాజకీయ నేతగా ప్రత్యేకత చాటుకున్న ఎన్టీఆర్ మరణించి ఏళ్లు గడుస్తున్నా తెలుగువారి గుండెల్లో నిలిచి ఉన్నారని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. ఎన్టీఆర్ 101వ జయంతి పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో పార్టీలకు అతీతంగా మంగళవారం జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఈశ్వర్ మాట్లాడుతూ.. తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రజాహిత, పాలనకు ప్రతీక నందమూరి తారక రామారావు అని కొనియాడారు. రెండు రూపాయలకే కిలో బియ్యాన్ని అందజేసి పేద వారి గుండెల్లో చెరగని ముద్రవేసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ముగియగానే కులగణన చేపట్టాలి

నిర్మల్ టౌన్: లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియగానే ప్రభుత్వం రాష్ట్రంలో కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కృష్ణంరాజు డిమాండ్ చేశారు. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల విషయంలో బీసీలకు అన్యాయం జరిగిందని తెలిపారు. బిహార్ తరహాలో తెలంగాణ అసెంబ్లీ, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతానికి రిజర్వేషన్లు పెంచాలని, ఈమేరకు ప్రత్యేక చట్టం చేయాలని కోరారు.

అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపిక

సారంగపూర్: మండలకేంద్రానికి చెందిన నక్క రాజన్న జాతీయస్థాయి అంబేద్కర్ పురస్కారానికి ఎంపికయ్యాడు. ఈమేరకు మంగళవారం ఆహ్వాన పత్రం అందిందని తెలిపాడు. ఈ అవార్డును వచ్చేనెల 10, మహారాష్ట్రలోని పుణేలో అందజేస్తారని పేర్కొన్నారు. అవార్డుకు రాజన్న ఎంపిక కావడంపై అంబేద్కర్ సంఘం మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



బీడీలు చుడుతున్న మహిళలు

ఎట్టకేలకు పెంపు..!

- బీడీ యాజమాన్యాలతో చర్చలు సఫలం
- 15 ఏళ్ల తర్వాత నూతన ఒప్పందం
- కార్మికుల కూలి రూ.4.25 పెంపు..
- ఉద్యోగులకు రూ.1,700, ప్యాకర్లకు రూ.3,650
- 1.15 లక్షల మందికి ప్రయోజనం

నిర్మల్‌చైన్‌గేట్: వేతనాల పెంపుకోసం బీడీ కార్మికులు దశాబ్దంగా చేస్తున్న పోరాటం ఎట్టకేలకు ఫలించింది. దాదాపు 15 ఏళ్ల తర్వాత బీడీ కార్మికులకు చెల్లించే కూలితోపాటు, ఉద్యోగులు, ప్యాకర్ల వేతనాలను పెంచేందుకు యాజమాన్యాలు అంగీకరించాయి. ఈమేరకు యాజమాన్యాలకు, బీడీ కార్మిక సంఘాలకు మధ్య ఈనెల 25న హైదరాబాద్‌లో జరిగిన చర్చలు ఫలించాయి. వేతనాల పెంపుపై కార్మిక సంఘాలు, యాజమాన్యాలకు మధ్య ఒప్పందం కుదిరింది. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 1.7 లక్షల మంది బీడీ కార్మికులు, సుమారు 7,500 మంది బీడీప్యాకర్‌లు, ఉద్యోగులకు లబ్ధి కలుగనుంది.

ఉమ్మడి జిల్లాలో 1.15 లక్షల మందికి లబ్ధి..

ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 1.15 లక్షల మందికిపైగా కార్మికులకు లబ్ధి చేకూరనుంది. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో టెలిఫోన్ కంపెనీ, చార్భాయ్, దేశాయి, శివాజీ, ఠాకూర్, సదరన్ ఇండియా కంపెనీలతోపాటు పలు బీడీ కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీలు ఉమ్మడి జిల్లాలో బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకొని బీడీలు చేయిస్తున్నారు. 1.15 లక్షల మంది కార్మికుల్లో 60 వేల మందికి రాష్ట్ర ప్రభుత్వం కల్పించే జీవనభృతి సౌకర్యం ఉండగా.. మరో 55,000 మంది కార్మికులకు లేదు. బీడీ సాటర్లు, చెన్నవాలా, గంపవాలాలు సుమారు 5 వేల మంది వరకు పని చేస్తున్నారు.



ప్యాకింగ్ చేస్తున్న బీడీ వర్కర్లు

ధరలకు అనుకూలంగా లేని పెంపు..

బీడీ కార్మిక చట్టం ప్రకారం కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీసం వేతనాలు, కూలి అమలు చేయాలి. ఈమేరకు కార్మిక సంఘాలు 15 ఏళ్లుగా పోరాటాలు చేశాయి. బీడీ పరిశ్రమను ప్రభుత్వాలే సంక్షోభంలోకి నెట్టేయడంతో కార్మిక, యాజమాన్య సంఘాలు పరస్పర అవగాహనతోనే పరిశ్రమను కాపాడుకునే పరిస్థితి ఏర్పడింది. ఈసారి జరిగిన చర్చల్లో కూడా యాజమాన్యం కూలీలకు కేవలం రూపాయి పెంచడానికి మాత్రమే మొదట అంగీకరించాయి. బీడీ ప్యాకర్లు, నెలసరి ఉద్యోగులకు కూడా అంతగా పెంచడానికి సుముఖత చూపలేదు. ఇరువర్గాల మధ్య ఈనెల 20న జరిగిన చర్చలు సఫలం కాలేదు. ఆరోజు బీడీ కార్మికులకు పది రూపాయల కూలి పెంచాలని కార్మిక సంఘాలు పట్టుపట్టాయి. దీంతో చర్చలు వాయిదా పడ్డాయి. శనివారం రెండో దఫా చర్చలు కొనసాగించగా పరస్పర అంగీకారంతో బీడీ కార్మిక సంఘాలు, యాజమాన్యాలు కూలీ, వేతనం పెంచడానికి అంగీకరించాయి.

వేతనాల పెంపు ఇలా...

వెయ్యి బీడీలకు గతంలో రూ.245.08 చొప్పున కూలి చెల్లించేవారు. తాజాగా రూ.4.25 పెంచిన యాజమాన్యాలు రూ.249.99 చొప్పున చెల్లించనున్నాయి. బీడీ ప్యాకర్లకు ప్రస్తుతం పొందుతున్న వేతనంపై నెలకి అదనంగా రూ.3,650, నెలవారీ వేతనం పొందే బట్టీవాలా, చెన్నీవాలా, బీడీ సాటర్లకు నెలకు రూ.1,700 పెంచేందుకు యాజమాన్యాలు ఒప్పుకున్నాయి. నూతన అగ్రిమెంట్ మే 1 నుంచి అమలులోకి రానుంది. కొత్త వేతనం రెండేళ్లపాటు అమలులో ఉండేలా ఒప్పందం కుదిరింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి..



తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం తరువాత ఎక్కువ మందికి ఉపాధి నిచ్చేది బీడీ పరిశ్రమ. ఈ బీడీ పరిశ్రమలో ఇంటికి ఒక్కరు చొప్పున బీడీ కార్మికులు బీడీలు చుడుతూ జీవనం కొనసాగిస్తున్నారు. 2016 సంవత్సరం నుంచి బీడీ పరిశ్రమ రోజురోజుకూ క్షీణిస్తోంది. కేంద్ర ప్రభుత్వం 28 శాతం జీఎస్టీ వసూలు చేస్తూ బీడీ కార్మికులను పట్టించుకోకుండా పరిశ్రమను మూసివేసే దిశగా కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. కార్మికులను ప్రభుత్వాలే ఆదుకోవాలి.

–కె.రాజన్న, తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

పుస్తకాలు వచ్చేశాయ్



పాఠ్యపుస్తకాల పంపిణీని ప్రారంభిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

- జిల్లాకు 83 శాతం చేరిక

మామడ: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠశాల ప్రారంభం రోజే పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. పాఠ్యపుస్తకాలు ఆరంభంలోనే అందితే ఉపాధ్యాయులు సకాలంలో సిలబస్‌ను పూర్తి చేయడంతోపాటు బోధనకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉంటుంది. ఈ క్రమంలో ప్రభుత్వం జిల్లాకు అవసరమైన పుస్తకాల్లో 83 శాతం పుస్తకాలను ఇప్పటికే జిల్లాకు పంపింది. మరోవైపు ఒక జత యూనిఫాం అందించే పనులను కూడా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇవిలా ఉండగా, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కార్యక్రమంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 533 ప్రాథమిక పాఠశాలలు 85 ప్రాథమికోన్నత పాఠశాలలో 117 ఉన్నత పాఠశాలలు, 18 కేజీబీవీలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 6,389 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను రెండు సెట్లుగా విభజించారు. ఇప్పుడు మొదటి సెట్ పుస్తకాలు గోదాంకు చేరుకున్నాయి. విద్యార్థులకు 3,63,946 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా, పాతవి 2,170 అందుబాటులో ఉన్నాయి. పుస్తకాల నిల్వ కేంద్రానికి 3,01032 పుస్తకాలు చేరుకున్నాయి.

1 నుంచి బడిబాట..

జూన్ 1 నుంచి బడిబాట కార్యక్రమం నిర్వహించాలని ఉన్నతాధికారుల నుంచి జిల్లా విద్యాధికారులకు ఆదేశాలు అందాయి. బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. పాఠశాలల్లో అందించే ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్య, పాఠశాలలో అందించే సౌకర్యాలను పోషకులకు వివరించి విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం పెంచాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

పాఠశాలలకు పుస్తకాలు..

మరోవైపు జూన్ 12న విద్యార్థులకు పంపిణీ చేసేందుకు జిల్లా కేంద్రంలోని గోదాం నుంచి పుస్తకాలను ఎమ్మార్సీలకు తరలిస్తున్నారు. ఉన్నత పాఠశాలలకు నేరుగా పుస్తకాలను అందిస్తున్నారు. గతంలో పాఠ్యపుస్తకాలు రావడం ఆలస్యం కావడంతో పాఠ్యాంశాల బోధన ఆలస్యమయ్యేది. ఈ ఏడాది పాఠశాల ఆరంభానికి ముందే పాఠ్యపుస్తకాలు రావడంతో ప్రణాళిక ప్రకారం తరగతులు కొనసాగనున్నాయి. ఆటంకం లేకుండా విద్యార్థుల చదువులు సాగనున్నాయి. ఎమ్మార్సీలకు చేరిన పుస్తకాలను అక్కడి నుంచి పాఠశాలలకు చేరేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. మొదటి పార్ట్‌లోని పుస్తకాలలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు పాఠ్యాంశాలకు సంబంధించిన సిలబస్ ఉంటుంది. సెప్టెంబర్‌లో పార్ట్ 2కు సంబంధించిన పుస్తకాలను విద్యార్థులకు అందిస్తారు.

మొదటి రోజే పాఠ్యపుస్తకాలు..



ఈ విద్యా సంవత్సరం ప్రారంభంరోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు పాఠశాలల్లో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 83 శాతం పాఠ్యపుస్తకాలు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. వాటిని ఎమ్మార్సీలకు తరలించే ప్రక్రియ కొనసాగుతోంది. అక్కడి నుంచి పాఠశాలలకు తీసుకువెళ్లాలని ప్రధానోపాధ్యాయులకు సూచించాం. పాఠశాలల ఆరంభం రోజే విద్యార్థులకు అందిస్తాం.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా అధికారులు

- ఎస్ఈసీ వికాస్‌రాజ్

నిర్మల్‌చైన్‌గేట్: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఓట్ల లెక్కింపుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈసీ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపులో పాల్గొనే సిబ్బంది సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలన్నారు. లెక్కింపు కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అనధికార వ్యక్తులేవరూ కౌంటింగ్ కేంద్రల్లోకి వెళ్లకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం ఓట్ల లెక్కింపు సకాలంలో ప్రారంభించి, కచ్చితమైన ఫలితాలను వెలువరించాలని సూచించారు. రౌండ్ల వారీగా పూర్తయిన లెక్కింపు వివరాలను సంబంధిత ఫారాలలో నింపాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో సందేహాలు, సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. అన్ని కౌంటింగ్ కేంద్రాల దగ్గర మీడియా సెంటర్లు ఏర్పాటు చేసి లెక్కించిన ఓట్ల వివరాలను తెలియజేయాలని సూచించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తాన్ని సీసీ టీవీ రికార్డు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపునకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. లెక్కింపు విధుల్లో పాల్గొనే అధికారులకు శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. రౌండ్ల వారీగా ఫలితాలను వెల్లడించడానికి ఐటీ బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, నిర్మల్, ముధోల్, ఉట్నూర్, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్ రెడ్డి, జీవాకార్, డీఎస్పీ గంగారెడ్డి, డీపీఆర్వో విష్ణువర్ధన్, ఎన్నికల పర్యవేక్షకులు శ్రీనివాస్, ఈడీఎం నదీం, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో జిల్లాకు పతకాలు

నిర్మల్‌టౌన్: ఈనెల 21 నుంచి 27 వరకు పూణేలోని ఛత్రపతి శివాజీ స్టేడియంలో నిర్వహించిన జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో నిర్మల్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. ఎల్.నాగలక్ష్మి కిక్ లైట్ 32 కేజీల విభాగంలో, సుజల కిక్ లైట్ 55 కేజీల విభాగంలో, నక్షత్ర లైట్ కాంటాక్ట్ 70 కేజీల విభగంలో వెండి పతాకాలు సాధించారని బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చందుల స్వామి వివరించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా క్రీడల అధికారి నస్పేఖాన్, ఎస్జీఎఫ్ సెక్రెటరీ రామారావు ప్రత్యేకంగా అభినందించారు.



వెండి పతకాలు సాధించిన క్రీడాకారులు

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం


- ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్ టౌన్: పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన భైంసా పట్టణ ఏఎస్సై బాలాజీ కుటుంబానికి పోలీస్ భద్రత నుంచి మంజూరైన చెక్కును పోలీస్ ప్రధాన కార్యాలయంలో అతని కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. భైంసా పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహించే బాలాజీ మార్చి 01న అనారోగ్యంతో మరణించాడు. దీంతో తెలంగాణ పోలీస్ భద్రత పథకం ద్వారా ఏఎస్ఐ కుటుంబానికి రూ.7,99,895 చెక్కును బాలాజీ భార్య సురేఖకు ఎస్పీ అందజేశారు. కుటుంబ స్థితిగతులపై ఆరా తీయడంతోపాటు, శాఖాపరంగా రావాల్సిన బెనిఫిట్లను త్వరగా అందేలా చూస్తామని తెలిపారు. పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధి విరాసత్ అలీ, ఏవో యూనుస్ అలీ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

సదరం స్లాట్.. సమస్య లేదిక..!



- నిరంతర ప్రక్రియగా స్లాట్ బుకింగ్

భైంసాటౌన్: దివ్యాంగులకు సదరం ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పొందాలంటే ధ్రువీకరణపత్రం ఉండాల్సిందే. ఇందుకు వైద్యారోగ్యశాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ సంయుక్తంగా ప్రతినెలా శిబిరాలు నిర్వహిస్తారు. అర్హులైన దివ్యాంగులు ముందుగా స్లాట్ బుక్ చేసుకుని సదరం శిబిరాల్లో వైద్యులతో పరీక్షలు చేయించుకోవాలి. వారి వైకల్య పరిస్థితిని బట్టి తాత్కాలిక(రెండేళ్లు), శాశ్వత దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలు అందిస్తారు. తాత్కాలిక దివ్యాంగ సదరం సర్టిఫికెట్ పొందినవారు గడువు పూర్తికాగానే పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది. ఇందుకు మళ్లీ మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుని, శిబిరానికి హాజరు కావాల్సి ఉంటుంది.

ఇబ్బందులకు చెక్..

అయితే, ఇదివరకు సదరం స్లాట్ బుకింగ్ అంటే దివ్యాంగులకు ప్రయాసతో కూడిన పని. సదరం శిబిరం నిర్వహించే షెడ్యూల్ తేదీలకు వారం ముందు స్లాట్ బుకింగ్‌కు అవకాశం కల్పించేవారు. నెలకోసారి నిర్వహించే శిబిరానికి 60 మందికి మాత్రమే అవకాశమిచ్చేవారు. దరఖాస్తుదారులు వందల్లో ఉండడం, స్లాట్‌లు మాత్రం తక్కువ సంఖ్యలో ఉండడంతో స్లాట్ బుకింగ్‌కు అవకాశమిచ్చిన రోజు ఉదయమే బుక్ అయిపోయేవి. దీంతో చాలామంది అర్హులైన దివ్యాంగులు మీసేవా కేంద్రాలకు వెళ్లేలోపే స్లాట్లు బుక్ అయిపోయాయన్న సమాధానం మీసేవా కేంద్రాల నిర్వహకుల నుంచి వచ్చేది. ఫలితంగా వారు నిరాశతో వెనుదిరిగేవారు. ఇలా ప్రతినెలా స్లాట్ బుకింగ్‌కు అవకాశమిచ్చినా.. సరిపడా స్లాట్లు లేక నెలల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. స్లాట్ బుకింగ్ కోసం దివ్యాంగులు వ్యయ, ప్రయాసలతో తీవ్ర ఇబ్బందులు పడేవారు.

ఇక నిరంతరం..

దివ్యాంగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సదరం స్లాట్ బుకింగ్‌ను నిరంతరం చేశారు. మీసేవా కేంద్రాల్లో ఎప్పుడైనా స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించారు. ఆయా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే స్లాట్ ఉంటే క్యాంపు తేదీ, శిబిరం నిర్వహించే చోటు చూపిస్తుంది. ఒకవేళ స్లాట్ లేకపోతే వెయిటింగ్‌లో చూపిస్తుంది. స్లాట్ అందుబాటులోకి రాగానే, దరఖాస్తు చేసుకున్నవారికి స్లాట్ కేటాయింపు జరుగుతుంది. ఈ మేరకు మొబైల్‌కు మెసేజ్ కూడా వస్తుంది. దీని ఆధారంగా ఆయా తేదీన నిర్వహించే శిబిరానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. సదరం స్లాట్ బుకింగ్ నిరంతరం కావడంతో ఇప్పటికే చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో దాదాపు 870 వరకు దరఖాస్తులు వెయిటింగ్‌లో ఉన్నాయి.

అధికారికంగా ఆదేశాలు రాలేదు..

సదరం స్లాట్ బుకింగ్ నిరంతర ప్రక్రియగా మారింది. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు సైతం చేసుకుంటున్నారు. దీనికి సంబంధించి అధికారికంగా ఆదేశాలు రాలేదు. సదరం శిబిరాలకు నిరంతర స్లాట్ బుకింగ్‌తో దివ్యాంగులకు ప్రయోజనం కలుగుతుంది.

– శోభారాణి, డీపీఎం, డీఆర్డీఏ

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్

తానూరు: నకిలీ విత్తనాలు అమ్మే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ హెచ్చరించారు. వానకాలం సాగు నేపథ్యంలో మండల కేంద్రంలోని రైతు వేదికలో విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలపై రైతులు, విత్తన షాపుల డీలర్లకు మంగళవారం అవగాహన కల్పించారు. రైతులకు కాలం చెల్లిన, నకిలీ విత్తనాలు, మందులు అమ్మినా లైసెన్స్ రద్దు చేయడడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో విధిగా రశీదు పొందాలన్నారు. రశీదుపై వివరాలు ఉన్నాయో లేదో చూసుకోవాలని సూచించారు. ప్యాకింగ్‌లేని విత్తనాలు కొనుగోలు చేయద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఏ వీణ, ఏవో గణేశ్, వ్యవసాయ విస్తరణ అధికారులు పవన్, సంఘవి, అంబాదాస్, విష్ణు, మండలంలోని డీలర్లు పాల్గొన్నారు.



తానూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న అంజిప్రసాద్

రైతులకు అవగాహన

ముధోల్: మండల కేంద్రంలో రైతులకు జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ మంగళవారం అవగాహన కల్పించారు. విత్తనాల కొనుగోలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేయొద్దని తెలిపారు. ఎవరైనా విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రశీదు తీసుకోవాలని, దానిపై లాట్ నంబర్ నమోదు చేయించుకోవాలని తెలిపారు. సాగులో వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. సమావేశంలో ఏడీఏ వీణ, ఏవో అజ్మీర భాస్కర్, ఏఈవో ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఎల్పీవో ఉదారత

తాంసి: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడడంతో తీవ్రగాయాలపాలైన యువకుడిని తన వాహనంలో ఆస్పత్రికి తరలించిన డీఎల్పీవో ఫణీందర్‌రావు ఉదారత చాటుకున్నారు. మంగళవారం భీంపూర్ మండలం అర్లి(టి)లో వివిధ పల్లెప్రగతి పనులను పరిశీలించిన డీఎల్పీవో జిల్లా కేంద్రానికి తిరుగు పయనమయ్యారు. అర్లి(టి), వడూర్ గ్రామాల మధ్య బైక్ అదుపుతప్పి కింద పడి గాయపడ్డాడు. క్షతగాత్రుడిని తన వాహనంలో ఎక్కించుకుని జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు.

చిరుత సంచారం

భైంసారూరల్: మండలంలోని సిరాల శివారులోని గుట్ట ప్రాంతంలో మంగళవారం చిరుత పులి సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన డేరే మాధవ్ మహాదేవుని గుట్ట ప్రాంతంలోని గుహల వద్ద చిరుత సంచరిస్తుండగా గమనించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ

ఉట్నూర్‌రూరల్: తేనెటీగల పెంపకంపై ఇవ్వనున్న శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఐటీడీఏ పరిధిలో ఆసక్తి కలిగిన గిరిజన యువతీ యువకులు , రైతులు ఈ శిక్షణ కార్యక్రమానికి తమపేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్టు ఉద్యాన అధికారి లేదా 9848687871, 88976225042 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

శిక్షణ శిబిరాన్ని సందర్శించిన పీవో



పరిశీలిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: భారత్ దేఖో స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని వికాసం ప్రత్యేక పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మంగళవారం సందర్శించారు. పెయింటింగ్, డ్రాయింగ్, స్టోరీ టెల్లింగ్ వంటి వివిధ అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఏటీడీఏ క్రాంతి కుమార్, వికాసం పాఠశాల ప్రిన్సిపాల్ వికాస్, ఎస్సీఆర్పీ బలరాం పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

భైంసాటౌన్: పట్టణంలోని రాహుల్‌నగర్ స్మశాన వాటిక సమీపంలో సుద్దవాగులో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం గుర్తించిన పశువుల కాపర్లు పోలీసులకు సమాచారమివ్వగా మృతదేహాన్ని వెలికి తీయించి స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని వయస్సు సుమారు 25 నుంచి 35 ఏళ్లలోపు ఉంటుందని సీఐ రాజారెడ్డి తెలిపారు.

అరచేతిలో వాతావరణం



- ప్రత్యేక యాప్‌లు రూపొందించిన కేంద్ర ప్రభుత్వం
- వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునే సౌలభ్యం
- అన్నదాతలకు ప్రయోజనకరమంటున్న అధికారులు

ఈ మధ్యకాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకరోజు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా మరొక రోజు ఈదురు గాలులతో కూడిన అకాలవర్షాలు కురుస్తున్నాయి. దీంతో అన్నదాతలు అయోమయానికి గురయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణంలోని మార్పులను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లు రూపొందించింది. వీటి ద్వారా వాతావరణ పరిస్థితులను అంచనా వేయొచ్చని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రధానంగా వర్షాకాలం మొదలుకానున్న నేపథ్యంలో ఉష్ణోగ్రతల వివరాలు, వర్షాల రాక సమాచారాన్ని కూడా వీటి ద్వారా తెలుసుకోవచ్చు. ఉరుములు, మెరుపుల నుంచి రక్షించుకోవడం, వర్షం పరిస్థితులను అంచనా వేయడం కూడా చేయవచ్చు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ రూపొందించిన ఈ యాప్ లు రైతులకు తోడ్పడనున్నాయి. ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లో ప్లే స్టోర్ ద్వారా వీటిని డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు. వాతావరణ సమాచారం మొత్తం మన అరచేతిలో ఉన్నట్లే..ఆ యాప్‌లు ఏమిటో తెలుసుకుందాం..

- నిర్మల్‌ఖిల్లా

ఒక్కోసారి వాతావరణంలో అప్పటికప్పుడు మార్పులు సంభవించి ఉరుములు మెరుపులు వస్తాయి. పిడుగుపాటు కూడా సంభవించే అవకాశం ఉంటుంది.



'డామిని'లో ఉరుములు, మెరుపుల హెచ్చరికల సమాచారం

ఇలాంటి హెచ్చరికలను తెలిపేందుకు డామిని యాప్ ప్రయోజనకరంగా ఉంటుంది. మెరుపు ఎప్పుడు వస్తుంది? మెరిసినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అప్రమత్తంగా ఉండాల్సిన తీరును ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. లొకేషన్ ఆధారంగా మెరుపులు వచ్చే అవకాశం ఉందో? లేదో? కూడా తెలుస్తుంది. పిడుగు పడినప్పుడు తోటి వారికి అందించాల్సిన వైద్య సహాయం వంటి ప్రాథమిక సమాచారాన్ని తెలియజేస్తుంది. రైతులకు, రైతు కూలీలకు బయటి ప్రాంతాల్లో పనిచేసే వారికి ఈ యాప్ ఎంతగానో తోడ్పడుతుంది.

వాతావరణ సమగ్ర వివరాలతో 'మేఘదూత్'



మేఘదూత్ యాప్‌లో వాతావరణానికి సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుంది. వర్షపాతం వివరాలు, గాలిలో తేమ, గాలి యొక్క వేగం, గాలి వీచే దిశ, నమోదైన ఉష్ణోగ్రతలు రానున్న 24 గంటల్లో వాతావరణ సమాచారం ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తుంది. గడిచిన వారం రోజులు, రానున్న మరో నాలుగు రోజుల వాతావరణ విశేషాలు సైతం ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.



వర్ష సూచనకు 'రెయిన్ అలారం'

వర్షం ఎప్పుడు పడుతుంది.. గడిచిన రోజుల వర్షపాతం వివరాలు, రానున్న కాలంలో వర్ష సూచనలను రెయిన్ అలారం యాప్ తెలియజేస్తుంది. మనం నివసిస్తున్న ప్రాంతంలో వాతావరణ వర్ష సూచనలతో పాటు ఇతర ప్రాంతాల్లో ఎక్కడెక్కడ ఏ స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయో, తదితర వివరాలు కూడా తెలియజేస్తుంది. వాతావరణంలోని ఉష్ణోగ్రత, గాలిలోని తేమ, మేఘావృతమైన ప్రాంతాల వివరాలను తగిన డేటాతో వివరిస్తుంది.

ప్రయాణంలోనూ 'పరీక్ష'పైనే ధ్యాస



డిగ్రీ వార్షిక పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన కెమిస్ట్రీ పరీక్షకు హాజరయ్యేందుకు తన తండ్రితో కలిసి ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్ నుంచి నలంద డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రానికి వెళ్తున్న ఓ విద్యార్థిని బైక్‌పైనే చదువుతూ వెళ్తుండడం గమనార్హం.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ప్రజాసమస్యల పరిష్కారానికి సోషలిజమే మార్గం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అబ్బాస్



మాట్లాడుతున్న అబ్బాస్

తలమడుగు: ప్రజా సమస్యలకు సోషలిజమే పరిష్కార మార్గమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అబ్బాస్ అన్నారు. మంగళవారం సీపీఎం ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ధనిక, పేద అంతరాలు తొలగాలన్నా శ్రామికుల జీవితాల్లో వెలుగులు రావాలన్నా శ్రామిక వర్గ సోషలిజం వస్తేనే సాధ్యమవుతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్టుబడి దారులకు ఎర్ర తివాచీ పరుస్తూ శ్రామికుల సంపదను కార్పొరేట్లకు దాసోహం చేస్తోందన్నారు. విత్తనాల కోసం రైతులు పడిగాపులు కాయడం బాధాకరమని, మార్కెట్లో అన్నిరకాల విత్తనాలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలు ఒకవైపు , కృత్రిమ కొరత మరోవైపు రైతులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి, రాష్ట్ర కమిటీ సభ్యుడు తొడసం భీంరావు, జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, కార్యదర్శి వర్గ సభ్యులు లంకా రాఘవులు, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు మంజుల, సోమేశ్, గంగన్న, నాయకులు లింగాల చిన్నాన్న విష్ణు, కొట్నాక్ సక్కు, మడావి నాగోరావ్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్ పట్టివేత

బేల: మండలంలోని జాతీయ రహదారి మార్గంలో దహెగాం క్రాస్ వద్ద సోమవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు కాంగార్‌పూర్ రెవెన్యూ గ్రామ శివారులోని పెన్‌గంగ ఇసుక క్వారీ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం మంగళవారం తహసీల్దార్‌కు నివేదించామన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో టిప్పర్, ట్రాక్టర్

నకిలీ విత్తనాలు స్వాధీనం

చింతలమానెపల్లి: మండలంలోని దిందా గ్రామంలో మంగళవారం 10 కిలోల నకిలీ విత్తనాలు పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వ్యవసాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా డగే తిరుపతి ఇంటి ముందు పత్తి విత్తనాలు దొరికాయి. విచారణలో ఈవిత్తనాలు కుంటల మానెపల్లి గ్రామానికి చెందిన శివుడు సరఫరా చేసినట్లు తేలింది. వ్యవసాయ అధికారి రామకృష్ణ ఫిర్యాదు మేరకు డగె తిరుపతి, శివుడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



విత్తనాలు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

అనుమతిలేని ఎరువులు పట్టివేత

తాంసి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడుతున్నాయి. దీనికి తోడు కొందరు ప్రభుత్వ అనుమతిలేని సేంద్రియ ఎరువులను పెద్దఎత్తున నిల్వ చేసి రైతులకు విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. మంగళవారం భీంపూర్ మండలంలోని మహారాష్ట్ర సరిహద్దుగా ఉన్న కరంజి(టి)లో అనుమతి లేని సేంద్రియ ఎరువులను నిల్వ చేయడానికి వ్యాపారులు లారీలో బస్తాలను తీసుకొచ్చారు. అనుమానం వచ్చిన స్థానిక రైతులు వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయడంతో మండల అధికారులకు సైతం సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న వ్యాపారి లారీతో పాటు అక్కడి నుంచి పారిపోయేందుకు యత్నిస్తుండగా భీంపూర్ ఎస్సై ప్రదీప్ కుమార్ సిబ్బందితో కలిసి మండలంలోని గోముత్రి గ్రామ సమీపంలో పట్టుకున్నారు. ఏవో రవీందర్‌తో కలిసి ఎరువులను పరిశీలించి ప్రభుత్వ అనుమతి లేని ఎరువులుగా గుర్తించి లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాటి విలువ రూ.5.55 లక్షల విలువైన 750 బస్తాల ఎరువులు ఉన్నట్లు గుర్తించారు. ఏవో ఫిర్యాదు మేరకు లారీని స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



పోలీసుల అదుపులో లారీ

ఆలయంలో చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్ట్

సారంగాపూర్: మండలంలోని అడెల్లి గ్రామ సమీపంలోని ప్రకాష్ తండాలో గల సేవాలాల్ ఆలయంలో చోరీకి యత్నించిన నిందితుడిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. సోమవారం రాత్రి సేవాలాల్ ఆలయంలో చోరీకి యత్నిస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు పట్టుకునేందుకు ప్రయత్నించగా తప్పించుకుని పారిపోయాడు. మంగళవారం ఉదయం బస్టాండ్ ఆవరణలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించగా తాను నర్సాపూర్(జి) మండలంలోని తురాటి గ్రామానికి చెందిన సైదుల నర్సయ్యగా పేర్కొన్నాడు. సేవాలాల్ ఆలయంలో దొంగతనానికి ప్రయత్నించిన వ్యక్తిని తానేనని, ఇటీవల జామ్ గ్రామంలోని మహాలక్ష్మీ ఆలయం, ఆలూరు పెద్దమ్మతల్లి ఆలయాల్లో కూడా దొంగతనం చేశానని నేరం అంగీకరించడంతో సదరు వ్యక్తిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి



సాయినాథ్ (ఫైల్)

తానూరు: అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని ఖర్బాలాలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఖర్బాలా గ్రామానికి చెందిన తడిపేలు సాయినాథ్ (35) మంగళవారం ఉదయం తన సొంత వ్యవసాయ భూమిలో ట్రాక్టర్‌తో చదును చేస్తుండగా అదుపుతప్పి అతనిపై బోల్తా పడింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సందీప్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సందీప్

బైక్ అదుపుతప్పి ఒకరికి తీవ్రగాయాలు

నేరడిగొండ: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. ఉట్నూర్ మండలం గొట్టిపటర్ గ్రామానికి చెందిన రాజ్‌ప్రసాద్ సారంగాపూర్ మండలం బీరెల్లి గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా వాహనం అదుపుతప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.



గాయాలపాలైన రాజ్‌ప్రసాద్

ఈతకు వెళ్లి యువకుడు మృతి



శివాజీ మాధవ్ (ఫైల్)

కడెం: ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భైంసా మండలం మాంజ్రి గ్రామానికి చెందిన శివాజీ మాధవ్ (25) అదే గ్రామానికి చెందిన విక్రమ్, భోజన్న, సాయినాథ్‌లతో కలిసి మంగళవారం కడెం ప్రాజెక్ట్ మరమ్మతు పనుల కోసం వచ్చారు. మధ్యాహ్న భోజన అనంతరం ప్రాజెక్ట్ దిగువన ఉన్న కుంటలో ఈతకు వెళ్లిన శివాజీమాధవ్ నీటిలో గల్లంతయ్యాడు. ప్రాజెక్ట్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి స్థానికుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని మేనమామ కొనపల్లి లింగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో పడి యువకుడు మృతి



రాజు (ఫైల్)

సోన్: మతిస్థిమితం కోల్పోయిన యువకుడు బావిలోపడి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సంతోషం రవీందర్ తెలిపిన వివరాల మేరకు లక్ష్మణచాంద మండలం ధర్మారం గ్రామానికి చెందిన బట్టు రాజు (25) పదేళ్లుగా మతిస్థిమితం కోల్పోయాడు. సోమవారం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం సోన్ మండలంలోని న్యూబొప్పారం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుని తండ్రి ముత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మృతదేహం లభ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని వాఘాపూర్ శివారులో మంగళవారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఏఎస్సై యూనుస్ తెలిపారు. వాఘాపూర్ గ్రామానికి చెందిన మడావి నారాయణ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించి దర్యాప్తు చేపట్టారు. ఆదిలాబాద్ పట్టణంలోని కొత్త హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన గజేశ్వర్ సునీల్ (45)గా గుర్తించారు. మృతుడు కొంతకాలంగా మూర్ఛతో పాటు మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో అతని భార్య కొన్నాళ్లుగా విడిగా ఉంటోంది. శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లగా మంగళవారం మృతదేహాన్ని గుర్తించారు. మూర్ఛ వ్యాధి కారణంగా పడిపోవడంతో వడదెబ్బకు గురై మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుని కుమారుడు సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వివరించారు.

దాడికి పాల్పడిన భర్తపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన మహెమూద్-అఫ్సాన దంపతుల మధ్య గతేడాది నుంచి గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆమె గతేడాది మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటినుంచి పుట్టింట్లోనే ఉంటోంది. సోమవారం మహెమూద్ అత్తారింటికి వెళ్లి కాపురానికి రావాలని భార్యను కోరాడు. ఆమె నిరాకరించడంతో కోపోద్రిక్తుడై బండరాయితో కడుపులో కొట్టాడు. అడ్డు వచ్చిన అఫ్సాన తల్లి హుస్నూర్‌తో పాటు మరో మహిళపై సైతం దాడి చేశాడు. బాధితులు మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లాల్‌సింగ్ నాయక్ వివరించారు.

వంకులంలో చోరీ

రెబ్బెన: మండలంలోని వంకులం గ్రామానికి చెందిన బోర్కుటే తిరుపతి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి నగదుతో పాటు బంగారం అపహరించుకుని వెళ్లినట్లు ఎస్సై డి.చంద్రశేఖర్ తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులంతా వారం రోజుల క్రితం తిరుపతికి వెళ్లి మంగళవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి ఇంటిముందు తలుపులు తెరిచి ఉన్నాయి. అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా తాళం పగలగొట్టి ఉంది. అందులో భద్రపర్చిన రెండు తులాల బంగారంతో పాటు, రూ. 20 వేల నగదు కనిపించకపోవటంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డ్రైవింగ్ స్కూళ్లలోనూ లైసెన్స్

- జూన్ ఒకటి నుంచి కొత్త చట్టం అమలు
- కనీసం మూడెకరాల స్థలం అవసరం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రహదారి భద్రత చట్టం అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం మరో నూతన సంస్కరణకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూళ్లను అందుబాటులోకి తీసుకు రానుంది. ఇకపై రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లనవసరం లేకుండా ఈ స్కూళ్లలో డ్రైవింగ్ శిక్షణ పొందిన వారికి నేరుగా డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేస్తారు. మోటారు వాహన చట్టం మార్పులో భాగంగా ఇకపై డ్రైవింగ్ లైసెన్స్ ప్రక్రియ అంతా కూడా ప్రైవేటు భాగస్వామ్యంలో సాగనుంది. ఈ చట్టం జూన్ ఒకటి నుంచి అమలులోకి రానుంది. కాగా, జిల్లాలో ఇప్పటివరకు అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూల్ లేదు సరికదా ఇప్పటికిప్పుడు డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు కూడా కష్టమే. రవాణా శాఖ చట్టం నిబంధన మేరకు అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు చేయాలంటే పలు నిబంధనలు కఠినంగా ఉన్నాయి. ఇప్పుడున్న వారు ఏర్పాటుకు సుముఖంగా లేరు. డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటుకు సంస్థలు, వ్యక్తులు ముందుకు వస్తే అనుమతి ఇస్తామని రవాణా శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పారదర్శకతతో డ్రైవింగ్ ఉంటేనే..

అక్రిడేటెడ్ డ్రైవింగ్ స్కూళ్లు ఇచ్చే డ్రైవింగ్ శిక్షణ నాణ్యమైనదిగా, సమర్థవంతమైనదిగా, పారదర్శకతతో ఉంటే లైసెన్స్‌లు ఇవ్వాలనేది రవాణా శాఖ ముఖ్యోద్దేశం. ఈ డ్రైవింగ్ స్కూళ్లు ఇచ్చే 5-ఏ సర్టిఫికెట్ల ఆధారంగా నేరుగా లైసెన్స్ జారీ చేస్తారు. డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలో రవాణా శాఖ అధికారులను పరిమితం చేస్తూ తీసుకొస్తున్న అక్రిడేటెడ్ స్కూళ్ల ఏర్పాటు ప్రస్తుతం కష్టతరంగానే ఉండబోనుంది. ప్రస్తుతం ఉన్న సాధారణ డ్రైవింగ్ స్కూళ్లు కూడా కఠిన నిబంధనలతో స్కూళ్ల ఏర్పాటు కష్టమే అంటున్నారు.

మూడెకరాలు కావాల్సిందే..

డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటుకు కనీసం మూడెకరాల స్థలం కావాలి. రెండెకరాల్లో డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్, ప్రాథమిక శిక్షణ కోసం సిమ్యులేటర్లు ఏర్పాటు చేయాలి. మరో ఎకరంలో శిక్షణ తరగతుల కోసం భవనం, తరగతి గదులు, ఇంటర్‌నెట్ సదుపాయం, ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థ, టీచింగ్ పరికరాలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఇందుకు పెద్దమొత్తంలో పెట్టుబడి అవసరం. భూముల విలువ రూ.లక్షలు, రూ.కోట్లలో ఉండగా మూడెకరాల్లో డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు కష్టమే అంటున్నారు. అయినా ముందుకు వచ్చి ఏర్పాటు చేస్తే ఆదాయం ఆ స్థాయిలో ఉంటుందా అనేది అనుమానమేనని అంటున్నారు.

వికసించిన మే పుష్పం

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో మే పుష్పం వికసించింది. ఏటా మే నెలలో మాత్రమే పూసే ఈ పువ్వు గ్రామానికి చెందిన ఎలుగు రాజలింగం ఇంటి ఆవరణలో మంగళవారం వికసించింది. ఒకేసారి మూడు పువ్వులు పూయడం సంతోషంగా ఉందని రాజలింగం కుటుంబ సభ్యులు తెలిపారు. ఈఏడాది మొత్తం ఐదు పువ్వులు పూశాయని పేర్కొన్నారు. ఈ పూలను చూసేందుకు స్థానికులు తరలి వస్తున్నట్లు వారు తెలిపారు.

